అనంతపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న డిఐజి, ఎస్పీ పోలీసు సిబ్బంది



# పేదల భూములపై పెద్దల కన్ను..!

## పరాధీనంలో 13648.63 ఎకరాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జిల్లాలో వేలాది ఎకరాల అసైన్డు భూములు పెద్దల చేతుల్లోకి వెళ్లిపోయాయి. దళితులు, మైనార్టీలు, వెనుకబడిన వర్గాలకు చెందిన భూములను భయపెట్టి, ప్రలోభపెట్టి, ఆశ చూపి విలువైన భూములను తమ వశం చేసుకున్నారు. ఇప్పుడు వీటికి చట్టబద్ధం చేసే దిశగా ప్రభుత్వ చర్యలుంటున్నాయన్న విమర్శలూ వ్యక్తమవుతున్నాయి. 20 ఏళ్ల క్రితం అసైన్డు చేసిన భూములకు భూ హక్కులు కల్పించే పేరుతో దీనికి తెరలేపినట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది జులై 27వ తేదీన అసైన్డు ల్యాండ్స్ సవరణ ఆర్డినెన్సును తీసుకొచ్చింది. దీని ప్రకారం 2002 జులై 31 కంటే ముందు అసైన్డు చేయబడిన భూములపై ఇదివరకున్న ఆంక్షలను ఎత్తివేస్తారు. దీనిపై సర్వేలు కొనసాగుతున్నాయి.

**పరాధీనంలో 13648.63 ఎకరాలు**

అనంతపురం జిల్లా పరిధిలో 222902.05 లక్షల ఎకరాలు అసైన్డు చేసిన భూమి ఉంది. 78040 మందికి అసైన్డు చేశారు. ఇందులో అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 55298.86 ఎకరాల అసైన్డు చేయగా 6067.52 ఎకరాలు అసైనీల వద్ద కాకుండా ఇతరుల వద్ద ఉండటం గమనార్హం. గుంతకల్లు డివిజన్ పరిధిలో 42550.65 ఎకరాలు అసైను చేసిన భూమి ఉండగా 4992.20 ఎకరాలు పరాధీనంలో ఉంది. కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలో 125062.74 ఎకరాలకు అసైను చేస్తే 2588.91 ఎకరాలు అన్యాక్రాంతమైంది. మొత్తం అసైను చేసిన దానిలో ఆరు శాతం భూమి ఇతరుల వద్దకు చేరింది. 5769 మంది రైతుల నుంచి 13648.83 ఎకరాలు ఇతరుల వద్దకు చేరింది. ఇందులో అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోనే ఎక్కువగా పరాధీనమైంది. 133425 ఎకరాలు వారి వారసుల వద్దనున్నట్టు అధికారిక రికార్డులు చెబుతున్నాయి. ఇక 75828 ఎకరాలు అసైనీల వద్దనే ఉన్నాయి.

**ఖరీదైన భూములపై కన్ను**

భూ యాజమాన్య హక్కులు ప్రభుత్వం కల్పిస్తున్న నేపథ్యంలో ఖరీదైన భూములపై రియల్ ఎస్టేట్ వ్యాపారులు, నేతల కళ్లు పడ్డాయి. ఇప్పటి వరకు అసైన్డు భూమి కావడంతో కొనుగోళ్లకు వెనుకడుగు వేస్తూ వచ్చిన వారు ఇప్పుడు ముందుగా గుర్తించి పేదల నుంచి భూ యాజమాన్యహక్కు పత్రాలు అందిన వెంటనే తమ వశం చేసుకునేందుకు వీలుగా పావులు కదుపుతున్నట్టు ఆరోపణలున్నాయి. ఎన్‌ఒసి పొందడం కూడా గగనమయ్యే పరిస్థితుల్లో వారు తమకిచ్చేయాలని ముందుగా ఒప్పందాలు చేసుకునేందుకు సైతం సిద్ధపడుతున్నారు. ప్రభుత్వం జులైలో ప్రకటించినా ఇంకా పూర్తి వివరాల సేకరణలో అధికార యంత్రాంగముంది. అన్నీ పూర్తయితే వెల్లడిస్తామని చెబుతున్నారు. ప్రభుత్వం సూచించిన ప్రకారమైతే జాబితాలు సిద్ధమవగానే సచివాలయాల వద్ద వీటిని ప్రదర్శనకు పెడుతామని ప్రకటించింది. వీటిని ఏర్పాటు చేస్తారా లేదా అన్నది చూడాల్సి ఉంది.

**పెద్దలకు కట్టబెట్టేందుకే**

పెద్దలకు పేదల భూములను కట్టబెట్టేందుకే ప్రభుత్వం ఈ రకమైన చర్యలు చేపట్టింది. ఆర్డినెన్సు ద్వారా దీన్ని తీసుకొచ్చి పేదల నుంచి భూములు లాగేసుకునే విధంగా ఇవి ఉంటున్నాయి. దీన్ని తాము వ్యతిరేకిస్తున్నాం. సర్వే వివరాలను కూడా సచివాలయాల వద్ద ప్రదర్శనకు పెడుతామన్న ప్రభుత్వ మాటలు అమలు జరగడం లేదు.

**కృష్ణమూర్తి,**
**ఎపి వ్యవసాయ కార్మిక సంఘం**
**జిల్లా ప్రధాన కార్యదర్శి.**

## అమరుల త్యాగాలు, ఆశయాలే స్ఫూర్తి

◆జిల్లా ప్రశాంతత, ప్రజల భద్రతే లక్ష్యంగా విధులు
◆డీపీవోలో ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినం

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

సమాజ భద్రత, రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల ఆశయాలను స్ఫూర్తిగా చేసుకుని విధుల్లో పునరంకితం అవుదామని అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్ఎన్.అమ్మిరెడ్డి, జిల్లా ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ పిలుపునిచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలోని పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సాయుధ బలగాల నుంచి డీఐజీ, ఎస్పీలు గౌరవ వందనం స్వీకరించి అనంతరం ప్రసంగించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ పోలీసు త్యాగాలను గుర్తించుకునే దినం అన్నారు. 1959వ సంవత్సరం అక్టోబర్ 21న లడక్ ప్రాంతంలో చైనా దళాలకు మనదేశ మిలిటరీ బలగాలకు భీకర యుద్ధం జరిగిందన్నారు. ఆ సందర్భంగా మన వీర జవానులు 10 మంది మరణించారని తెలిపారు. అప్పటి నుంచి ప్రతి ఏటా పోలీసు సంస్మరణ దినం జరుపుకుంటున్నామన్నారు. విధి నిర్వహణలో పోలీసులు ఎన్నో త్యాగాలు చేసి సేవలు అందిస్తున్నారు. ఈ క్రమంలో ప్రాణాలొదిలిన ప్రతి అమర పోలీసులకు నివాళులు అర్పిస్తున్నామన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో చనిపోయిన పోలీసుల సేవలు గుర్తు చేసుకోవాలన్నారు. సమాజం కోసం ప్రాణాలు అర్పించిన త్యాగధనుల సేవలను స్మరించుకుంటూ ముందుకెళ్దామని పిలుపునిచ్చారు. ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్ మాట్లాడుతూ సమాజం కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు కుటుంబాలకు ప్రజలు కూడా అండగా నిలవాలన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవంలో భాగంగా జిల్లాలో పది రోజుల పాటు ఒక్కో రోజు ఒక్కో కార్యక్రమం చొప్పున అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రజలు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విధి నిర్వహణలో ప్రాణాలు పోయాయని తెలిసినా తమ పిల్లలను యూనిఫాం సర్వీస్ లోకి పంపుతున్న తల్లిదండ్రుల ఆలోచన, నిర్ణయాలు చాలా గొప్పవని, వారందరికీ కతజ్ఞతలు అన్నారు. ప్రజల కోసం ధైర్యంగా, నిష్పక్షపాతంగా పని చేద్దామని సూచించారు. డీఐజీ, ఎస్పీ, ప్రముఖులు, అధికారులు పోలీసు అమరవీరుల స్థూపం వద్ద అమర పోలీసుల్ని స్మరించుకుంటూ పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం అమరులైన పోలీసులకు పేరుపేరునా నివాళులు అర్పించడంతో పాటు వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. కుటుంబ సభ్యులకు చెక్కులు అందించడంతో పాటు వివిధ కారణాలతో మతి చెందిన హోంగార్డుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామక పత్రాలు అందజేశారు.

సివిల్ సప్లయ్ డిఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న హమాలీలు

## హమాలీలకు బకాయి వేతనాలు చెల్లించాలి

యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఆర్‌వి.నాయుడు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సివిల్ సప్లయ్ స్టాక్ పాయింట్‌లో పని చేస్తున్న హమాలీల జీతాలు, బోనస్ తక్షణమే చెల్లించాలని హమాలీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఆర్‌వి.నాయుడు డిమాండ్ చేశారు. శనివారం సిఐటియు ఆధ్వర్యంలో సివిల్ సప్లయ్ హమాలీలు సివిల్ సప్లయ్ డిఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 26 జిల్లాల్లో హమాలీలకు జీతాలు, బోనస్ చెల్లించారని తెలిపారు. జిల్లాలోని 12 స్టాక్ పాయింట్లలో మాత్రమే జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ప్రధానంగా దసరా పండుగ 23న ఉంది కావున జీతాలు వెంటనే ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. విషయం తెలుసుకున్న సివిల్ సప్లయ్ శాఖ డిఎం నీలమయ్య ఆందోళనకారుల వద్దకు వచ్చి చర్చించారు. సాయంత్రంలోగా హమాలీల వేతనాలు వారి ఖాతాల్లో జమ అవుతాయని హామీ ఇచ్చారు. బోనస్ నాలుగైదు రోజుల లోపల చెల్లిస్తామని చెప్పారు. అనేక మందికి పిఎఫ్‌లో పేర్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారికి తొందరలోనే పిఎఫ్ నంబర్ వచ్చేటట్లు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నారాయణస్వామి, కోశాధికారి సుబాన్, మేస్త్రీలు నారాయణస్వామి, శంకర్, అనంతపురం అర్బన్ రూరల్ స్టాక్ పాయింట్ హమాలీలు, తదితరులు పాల్గొన్నారు.

## 23 , 24న మెరుపు సమ్మె

కార్మికుల సమ్మెకు ప్రజలు మద్దతివ్వాలి
మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23, 24వ తేదీల్లో మున్సిపల్ కార్మికులు చేపట్టనున్న మెరుపు సమ్మెకు ప్రజలు మద్దతు ఇవ్వాలని మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలే తమ కుటుంబం అంటూ ముందుకు నడిచిన మున్సిపల్ కార్మికులకు ప్రజలందరూ అండగా నిలవాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. చెమటోడ్చి అనునిత్యం నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ పారిశుధ్య కార్మికులు, గొంతు ఆరకుండా నీళ్లిచ్చే, ఇంజినీరింగ్ సెక్షన్ వాటర్ సప్లై కార్మికులు, ప్రజలను చీకట్లో ఉంచకుండా వెలుతురులో ఉండే విధంగా నగరాన్ని విద్యుత్ అలంకరణతో నిరంతరం కష్టపడుతున్న ఎలక్ట్రిషన్స్ కార్మికులు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేస్తున్నప్పటికీ ప్రభుత్వం సమస్యలు పరిష్కరించలేదన్నారు. ఆయా కార్మికులు 25 సంవత్సరాలుగా సేవ చేస్తున్నా ప్రభుత్వాలు కనీసం రక్షణ కల్పించలేకపోతున్నాయన్నారు. వివిధ రకరకాల కారణాలతో ఇంజినీరింగ్ కార్మికుల్ని మూడు సంవత్సరాల కిందట 60 సంవత్సరాల రిటైర్మెంట్, ఉద్యోగం నుంచి 13 మందిని తొలగించారన్నారు. నగరం విస్తీర్ణం పెరిగినా అందుకు తగ్గట్టుగా కార్మికులను పెంచడం లేదన్నారు. రెగ్యులర్ కార్మికులకు మూడేళ్లుగా సరెండర్ లీవ్ ఇవ్వకుండా, డిఏలు, ఇంక్రిమెంట్లు రాయకుండా, పనిముట్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం మంచిది కాదన్నారు. చాలీచాలని జీతంతోనే కార్మికులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కార్మికులు చేపట్టనున్న మెరుపు సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. అప్పటికీ సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెలో వెళ్లడానికి కూడా వెనకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో, నగర అధ్యక్షుడు బండారి, ఇంజినీరింగ్ సెక్షన్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున, నగర కార్యదర్శి మురళి, కోశాధికారి పోతలయ్య, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్‌మూర్తి, ఆది, ప్రభాకర్, మహిళా కన్వీనర్ మంత్రి వరలక్ష్మి, లక్ష్మీనరసమ్మ, మరియమ్మ, కృపమ్మ, పెద్దక్క, రాజమ్మ, తదితర కార్మికులు పాల్గొన్నారు.

## వారంలో రెండు రోజులు ఖాదీ దుస్తులు ధరించాలి

ఖాదీ మహోత్సవంలో జెఎన్‌టియు విసి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

ఖాదీ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న జెఎన్‌టియు వైస్‌ఛాన్సలర్ జి.రంగజనార్ధన

చేనేత కార్మికులు, చేనేత రంగాన్ని ప్రోత్సహించేందుకు జెఎన్‌టియు పరిధిలోని ప్రతి ఉద్యోగి వారంలో రెండు రోజులు తప్పనిసరిగా ఖాదీ వస్త్రాలు ధరించాలని జెఎన్‌టియు ఉపకులపతి జి.రంగజనార్ధన పిలుపునిచ్చారు. శనివారం జెఎన్‌టియులోని ఇసిఇ విభాగంలో ఏర్పాటు చేసిన ఖాదీ ఎగ్జిబిషన్‌ను విసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.సత్యనారాయణ, వర్సిటీ డైరెక్టర్లు సురేష్‌బాబు, ఈశ్వర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, శోభా బిందు, ఖాదీ మహోత్సవ కార్యక్రమం కోఆర్డినేటర్ జి.మమత, వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ చంద్రమోహన్‌రెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

చిన్న వెంకటయ్యకు నివాళులర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

## కమ్యూనిస్టు నేత చిన్న వెంకటయ్యకు నివాళి

ప్రజాశక్తి-తాడిపత్రి

పట్టణంలోని భగత్‌సింగ్ నగర్ కాలనీలో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నాయకుడు చిన్న వెంకటయ్యకు సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ నివాళులర్పించారు. శుక్రవారం పట్టణంలోని స్వగృహంలో చిన్న వెంకటయ్య అస్వస్థత గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆసుపత్రి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ పట్టణానికి చేరుకుని చిన్న వెంకటయ్య మృతదేహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించిన తర్వాత కుటుంబ సభ్యులను పరామర్శించారు. యాడికి మండలం కోన ఉప్పలపాడుకు చెందిన చిన్న వెంకటయ్య ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీల్లో క్రియాశీలకంగా సేవలందించారు. ఈయనకు నలుగురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. నివాళులర్పించిన వారిలో తాడిపత్రి సిపిఎం నాయకులు జగన్మోహన్‌రెడ్డి, సిపిఎం నాయకులు ఉన్నారు.

## కరువు మండలాలను ప్రకటించాలి

ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి

పత్తి పంటను పరిశీలిస్తున్న ఎపి రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొని పంటలు ఎండిపోయి కరవుఛాయలు అలుముకుంటున్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే కరువు మండలాలను ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండలంలో రైతుసంఘం నాయకులు పర్యటించి రైతులు సాగుచేసిన పత్తి, మిరప, వేరుశనగ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు లేక పంటలు నిట్టనిలువుగా ఎండుతున్నాయన్నారు. కరవు ఛాయలు వచ్చాయన్నారు. కనీసం కూలీలకు కూలి ఇచ్చే పరిస్థితుల్లో కూడా రైతులు లేరన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రతినిధులు పొలంబాట పట్టి పంట పొలాలను పరిశీలించి రైతులకు న్యాయం చేయాలన్నారు రైతులకు భరోసా కల్పించేలా మద్దతు సాయం ప్రకటించి ప్రత్యామ్నాయ పంటలకు ప్రభుత్వమే పెట్టుబడి సాయం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే అనంతపురాన్ని కరువు జిల్లాగా ప్రకటించి రైతులను పూర్తిస్థాయిలో ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం మండల కార్యదర్శి దస్తగిరి, రైతులు ముత్యాలురెడ్డి, హనుమంతురెడ్డి, శేఖర్, హరినాథ్, ముత్యాలురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సీఐ ప్రవీణ్‌కుమార్‌కు సన్మానం

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను డిజీహెచ్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు గోపాల్, దళిత నాయకులు శనివారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దళిత గిరిజనుల హక్కుల సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మీనుగ గోపాల్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో దళిత గిరిజన, బహుజనులకు ఎక్కడ అన్యాయం జరిగిన వెంటనే స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిజిహెచ్ఎస్ నాయకులు లత్తవరం చంద్రశేఖర్, వజ్రకరూరు మేరీ పాల్, పీసీ ఫ్యామిలీ అర్జున్, ఉరవకొండ మాజీ వార్డ్ నెంబర్ పెద్దన్న, బండారు ఓబయ్య, షెక్షానిపల్లి రమేష్, విసికె జిల్లా నాయకులు రెనుమాకులపల్లి గోపాల్, వ్యాసాపురం మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత : ఎమ్మెల్యే అనంత

ప్రజాశక్తి-అనంతపురం

సిఎం జగన్ విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని 1వ డివిజన్‌లో వైఎస్ఆర్ అర్బన్ హెల్త్‌సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడతూ విద్య, వైద్యం అనేవి పేదలకు చేరువైనప్పుడే వారి జీవితాల్లో మార్పు వస్తుందన్నారు. విద్య, వైద్యం కోసం ఎంతో మంది ఆర్థికంగా చితికిపోయే పరిస్థితి ఉందన్నారు. ఈనేపథ్యంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక అనంతపురం నియోజకవర్గంలో 9 అర్బన్ హెల్త్ సెంటర్లను అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రతి కేంద్రంలో ఎంబీబీఎస్ వైద్యులను, నిపుణులైన వైద్య సిబ్బందిని నియమించాలమని చెప్పారు. కార్పొరేట్ స్థాయి సదుపాయాలను కల్పించామన్నారు. రోగుల కోసం వెయిటింగ్ రూం, ప్రసూతి గది, లేబొరేటరీ..ఇలా అన్ని వసతులు కల్పించి ఏకంగా 62 రకాల వైద్య పరీక్షలను అర్బన్ హెల్త్ సెంటర్లలోనే చేస్తున్నామన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రతి పేదవాడికీ కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించాలన్న లక్ష్యంతో ఆరోగ్య శ్రీ పథకాన్ని తీసుకొస్తే చంద్రబాబు అధికారంలోకి వచ్చాక 2014 నుంచి 2019 వరకు ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేశారని గుర్తు చేశారు. జగన్ సీఎం అయిన తర్వాత 3 లక్షలున్న వార్షిక ఆదాయ పరిమితిని రూ.5 లక్షలకు పెంచడమే కాకుండా ప్రస్తుతం 3256 వ్యాధులకు ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స అందిస్తున్నామన్నారు. గడిచిన 20 రోజుల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' కొనసాగు తోందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి సచివాలయం పరిధిలో వాలంటీర్లు, సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది సర్వే చేసి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ మహమ్మద్ వసీం, డీఎంహెచ్ఓ దేవి, నగర పాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి, ఈఈ నాగమోహన్, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్లు లాలూ, ఇసాక్, శ్రీనివాసులు, సైఫుల్లాబేగ్ తదితరులు పాల్గొన్నారు.

## 15 ఏళ్ల నాటి ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కారం

మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

15 ఏళ్లుగా పట్టణంలోని 560 మంది పేదల ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కారం చూపినట్లు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఇళ్ల పట్టాల లబ్ధిదారులతో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ నాడు ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పట్టణంలోని పేదలకు దొంగ పట్టాలు పంచి మోసం చేశాడని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక ఆ సమస్యను పరిష్కరించి 2,500 మందికి ఇంటి స్థలాలతోపాటు ఇళ్లు కూడా మంజూరు చేశామన్నారు. అయితే కొందరి కుట్రల కారణంగా కోర్టులో నలుగుతున్న 560 పేదల ఇళ్ల పట్టాల సమస్యను పరిష్కరించామని వివరించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఇళ్ల స్థలాల కోసం పెద్ద పోరాటం చేశామని గుర్తు చేశారు. అనంతరం వందలాది మహిళలతో వైఎస్ఆర్ సర్కిల్ వరకూ ర్యాలీగా వెళ్లి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హరిప్రసాద్, వైసిపి పట్టణ, రూరల్ మండలాల అధ్యక్షులు ఏసి ఎర్రిస్వామి, ముష్టూరు వైసీపీ నరసింహులు, ఎంబీసీ రాష్ట్ర డైరెక్టర్ జోగి వెంకటేశులు, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు బసవరాజు, జెసి ఎస్ కన్వీనర్ ఆసీఫ్, జిల్లా వక్ఫ్ బోర్డ్ సభ్యుడు మీరాంబాషా, మండల కోఆప్షన్ సభ్యులు వడ్ల సలీం, పెన్నఅహోబిలం ఆలయం మాజీ చైర్మన్ అశోక్‌కుమార్, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# తరుముకొస్తున్న కరువు




**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మరోమారు కరువు తరుముకొస్తోంది. మూడేళ్లుగా వర్షాలు పడుతుండటంతో జిల్లాలో ఎక్కడ చూసిన పచ్చదనం కనిపిస్తూ వచ్చింది. 2018లో 328 మిల్లీమీటర్లు మాత్రమే వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత నుంచి వరుసగా వర్షాలు సాధారణం కంటే ఎక్కువగానే నమోదవుతూ వచ్చాయి. అయితే ఈ ఏడాది మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. వర్షాభావం జూన్ నుంచే కొనసాగుతూ వస్తోంది. అనంతపురం జిల్లాలో 25 మండలాల్లో వర్షాభావం నెలకొంది. ఇప్పటి వరకూ ఈ జిల్లా పరిధిలో 399 మిల్లీమీటర్లు సాధారణ వర్షపాతం కురవాల్సి ఉండగా 253 మిల్లీమీటర్లు మాత్రమే పడింది. 36 శాతం వర్షపాతం లోటు ఈ జిల్లాలో నమోదైంది. అదే సత్యసాయి జిల్లాలో 22 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఇందులో నాలుగు మండలాల్లో తీవ్ర వర్షాభావం కనిపిస్తోంది. సత్యసాయి జిల్లాలో 33 శాతం వర్షపాతం లోటుంది. సత్యసాయి జిల్లాలో 446 మిల్లీమీటర్లు సాధారణ వర్షపాతం నమోదవ్వాల్సి ఉండగా 298 మిల్లీమీర్లు నమోదైంది. ఈ వర్షాభావానికి తోడు ఎగువనున్న తుంగభద్ర, శ్రీశైలం జలాశాయాల్లోనూ నీటి మట్టం పడిపోతుండటంతో హంద్రీనీవా ఇప్పటికే నీటి సరఫరా ఉండటం లేదు. తుంగభద్ర వచ్చే నెల 10వ తేదీతో బంద్ కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆయకట్టు రైతులోన్లూ ఆందోళన నెలకొంది. ఇప్పటికే హంద్రీనీవా, మిడ్‌పెన్నార్ ఉత్తర కాలువ కిందనున్న మిరప పంట ఎండిపోతోంది. దీన్ని రక్షించుకునేందుకు రైతులు అనేక రకాలు ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంకర్లతో నీళ్లను తోడి రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇక మెట్ట రైతుల పరిస్థితులు వేరే చెప్పనక్కర్లేదు. వేరుశనగ పంటను నూర్పిడి చేయడానికి కూడా నేలలో తేమ లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇలా మెట్ట, ఆయకట్టు రైతులు ఇద్దరూ ఇబ్బందులు పడుతున్నారు. రాబోయే రోజుల్లో ఇది మరింత తీవ్రమయ్యే అవకాశాలున్నాయన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. దీనిపై టిడిపి, సిపిఎం, సిపిఐ నాయకులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులను ఆదుకోవాలన్న డిమాండ్‌ను వినిపిస్తున్నాయి. ఖరీఫ్ పంటలు మొత్తం దెబ్బతినే సూచనలు ఉన్నాయంటున్నారు. పాలకులు వెంటనే తేరుకుని పంటలను రక్షించేందుకున్న మార్గాలను అన్వేషించాలని సూచిస్తున్నాయి. కానీ అధికారపార్టీకి ఇవేవి పట్టనట్టు కనిపిస్తోంది. ఈవారంలో జిల్లా ఇన్‌ఛార్జి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా కరువు పరిస్థితులపై ఏమైనా సమీక్ష జరుపుతారని అందరూ భావించారు. అయితే ఆయన ఈ సమీక్ష కంటే రాజకీయ సమీక్షకే ప్రాధాన్యత ఇచ్చారన్న విమర్శలు వినిపించాయి. కేవలం ఈనెల 26న ఉంచి ఆ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టబోయే సామాజిక బస్సుయాత్రపై సమీక్ష చేసి వెళ్లిపోయారు. ఒకవైపు తాగునీటి సమస్య, మరోవైపు సాగునీటి సమస్య కళ్ల ముందు కనిపిస్తున్నా... వీటిపై ఏ మాత్రం దృష్టి సారించకపోగా రాజకీయ అంశాలకే అధిక ప్రాధాన్యతనివ్వడం అనేక విమర్శలకు సైతం తావిస్తోంది. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఎపి పండ్లతోటల రైతు సంఘం ఆధ్వర్యంలో తాడిపత్రిలో రాష్ట్ర స్థాయి సదస్సు జరిగింది. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కరువులో రైతులను ఆదుకోవాల్సిన అంశాలు ఈ సదస్సులో చర్చకు వచ్చాయి. భూగర్భ జలాలు కూడా వేగంగా పడిపోతుండటంతో బోరుబావుల్లో నీరు ఇంకిపో మార్చినాటికి ఉద్యానవన పంటలకు పెద్దదెబ్బ పడబోతోందనిసంఘం నాయకులు చెప్పారు. ఈ రైతులను ఆదుకునే దిశగా ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు.

హర్షం వ్యక్తం చేస్తున్న ఎపి రైతుసంఘం, సిఐటియు నాయకులు

## రైతుసంఘం ఆధ్వర్యంలో 'వాచాతి' విజయోత్సవం

**ప్రజాశక్తి-పెద్దవడుగూరు**

ఎపి రైతుసంఘం, సిఐటియు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శనివారం వాచాతి విజయోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, మండల కార్యదర్శి దస్తగిరి మాట్లాడుతూ తమిళనాడులో మదమెక్కిన అధికార యంత్రాంగానికి కోర్టు తీర్పు చెంప పెట్టు అన్నారు. తమిళనాడు రాష్ట్రంలోని ధర్మపురి జిల్లాలో అడవి లోతట్టున ఉన్న గ్రామం వాచాతిలో మహిళలపై జరిగిన దాడి ఘోరం అన్నారు. 1992 జూన్ 20న వాచాతి గ్రామం మీదకు దండెత్తిన అటవీ అధికారులు, వారికి మద్దతుగా రెవెన్యూ, పోలీస్ అధికారులు దాదాపు 18 మంది మహిళలు, బాలికలు అత్యాచారానికి గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుర్మార్గనికి ఒడిగట్టిన 215 మంది ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులను నేరస్తులుగా నిర్ధారించి శిక్ష అనుభవించాలని మద్రాస్ హైకోర్టు ఆదేశించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆదినారాయణ, వెంకటరాముడు, ఆది, సులేమాన్, హసేన్, రంగప్ప, ఎరికలయ్య, చితంబర్‌రెడ్డి, ఆటారి, తదితరులు పాల్గొన్నారు.

## యూరియా నిల్వల తనిఖీ

ఎరువుల రికార్డులను తనిఖీ చేస్తున్న ఎడిఎ రవి

**అనంతపురం :** జిల్లాకు వచ్చిన ఐపీఎల్ యూరియా రేక్‌ను అనంతపురం వ్యవసాయ డివిజన్ ఎడిఎ ఎం.రవి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు కేటాయించిన ఐపీఎల్ యూరియా ప్రసన్నాయిపల్లి రైల్వే రేక్ పాయింట్‌కు చేరుకున్నట్లు తెలిపారు. ఇందులో 840 మెట్రిక్ టన్నుల ఐపీఎల్ యూరియా వచ్చినట్లు తెలిపారు. కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశాల మేరకు 413 మెట్రిక్ టన్నుల యూరియా మార్ఫిడి కేటాయించగా మిగిలిన యూరియాను ప్రయివేట్ డీలర్లకు సరఫరా చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐపీఎల్ కంపెనీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## మాముడూరులో పంటకోత ప్రయోగాలు

పంటకోత ప్రయోగం చేస్తున్న అధికారులు

**గుత్తి :** మండలంలోని మాముడూరు గ్రామంలో వ్యవసాయ అధికారులు శనివారం పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. రైతు కె.ఆదినారాయణకు చెందిన పొలంలో పంటకోత ప్రయోగం నిర్వహించగా 1.460 గ్రాముల దిగుబడి వచ్చినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. అలాగే మరో రైతు పి.దస్తగిరి పొలంలో పంట కోత ప్రయోగం చేయగా 1.960 గ్రాముల దిగుబడి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ ఎం.వెంకటరాముడు, ఏఎస్ఓ శ్రీనివాస్‌నాయక్, ఎంపిటిసి ఎంసీ.లాలెప్ప, వైసీపీ నాయకుడు ఎం.రామాంజనేయులు, మాజీ సర్పంచి తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ భవనం కొనుగోలుకు విరాళం

విరాళం అందజేస్తున్న దృశ్యం

**రాయదుర్గం :** పట్టణంలోని ఓబుళాచారి రోడ్డు బన్నీ మహంకాళి ఆలయానికి భవన కొనుగోలుకు టిడిపి బీసీ సెల్ రాయదుర్గం శాఖ అధ్యక్షుడు పూజారి తిప్పయ్య రూ.15,116 విరాళం ఇచ్చారు. మాజీ మున్సిపల్ ఛైర్మన్ పూజారి జితేంద్రప్ప 13వ వర్ధంతి సందర్భంగా జితేంద్రప్పను స్మరించుకుంటూ ఆలయానికి భవనం కొనుగోలు రూ.15,116 విరాళాన్ని ఆలయ కమిటీ నిర్వాహకులు పూజారి శివప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు జకాతి కృష్ణమూర్తి, దబ్బడి మంజునాథ, తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ ఆఖరు వరకూ సాగునీరు ఇవ్వాలి

### సిపిఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

**ప్రజాశక్తి-ఉరవకొండ**

సంతకాల సేకరిస్తున్న సిపిఎం నాయకులు

నియోజకవర్గ వ్యాప్తంగా లక్షలాది ఎకరాల్లో రైతులు సాగు చేసిన పంటలను దృష్టిలో ఉంచుకుని హంద్రీనీవా, హెచ్ఎల్‌సి కెనాల్ అధికారులు డిసెంబర్ 30వ తేదీ వరకూ సాగునీరు విడుదల చేయాలని సిపిఎం మండల కన్వీనర్ విరుపాక్షి డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ రైతు, వ్యవసాయ, కార్మిక, కౌలు రైతుసంఘాల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పడుతున్న ఇబ్బందులు, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే సంతకాల సేకరణ చేపట్టినట్లు తెలిపారు. డిసెంబర్ 30వ తేదీ వరకూ సాగునీరు ఇవ్వకపోతే ఆత్మహత్యలే శరణ్యమన్నారు. నియోజకవర్గ పరిధిలో లక్షలాది ఎకరాల్లో రూ.లక్షలు వెచ్చించి మిరప, పత్తి, కంది, వేరుశనగ తదితర పంటలను సాగు చేశారన్నారు. ప్రస్తుతం పంటలు పూత, కాయ దశకు చేరుకున్నాయన్నారు. ఈనేపథ్యంలో సాగునీరు బంద్ చేస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. రైతుల ఇబ్బందులను గుర్తించి డిసెంబర్ ఆఖరు వరకూ సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు చాయాపురం రంగనాయకులు, చాబాల సుధాకర్, సిఐటియు నాయకులు సుధాకర్, హమాలీ సంఘం నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

### మంత్రి ఉషశ్రీచరణ్, మాజీ ఎమ్మెల్యే విశ్వ

**ప్రజాశక్తి-బెలుగుప్ప**

సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్, మాజీ ఎమ్మెల్యే విశ్వ

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి ఉషశ్రీచరణ్, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని కాలువపల్లిలో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని ప్రారంభించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల కోసం నవరత్నాల్లో భాగంగా ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఆదుకున్న మహనీయుడని సిఎం జగన్ అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ డి.ఓబులేసు, ఎంపిడిఒ రామచంద్ర, వైసిపి నాయకులు వీరన్న, ఎంపిపి పెద్దన్న, కుమ్మతి త్రిలోక్‌నాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ మచ్చన్న, సింగిల్‌విండో అధ్యక్షులు శివలింగప్ప, జి.శ్రీనివాసులు, కాలువపల్లి సర్పంచి పెద్దన్న, మాజీ ఎంపిటిసి వెంకటేశులు, మల్లారెడ్డి, తిమ్మన్న, పి.శ్రీనివాసులు, నాగిరెడ్డి, కరుణాకర్, జయరామేశ్వర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, రుద్రానంద, రామిరెడ్డి, వెంకటరెడ్డి, బాబురెడ్డి, సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

## యువత దేశభక్తిని అలవర్చుకోవాలి

**ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం**

కుండల్లో మట్టిని పోస్తున్న అతిథులు

యువత దేశభక్తిని అలవర్చుకుని ముందుకు సాగాలని ఎంపిడిఓ తేజోష్ణ, మండల రెవెన్యూ అధికారిణి రమాదేవి, ఐక్యరాజ్యసమితి అవార్డు గ్రహీత బిసాటి భరత్ పిలుపునిచ్చారు. అనంతపురం నెహ్రూ యువకేంద్రం, బుక్కరాయసముద్రం పంచాయత్ రాజ్, రెవెన్యూ కార్యాలయ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో మేరా మట్టి.. మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన మేరా దేశ్.. మేరా మట్టి కార్యక్రమం ద్వారా మట్టికి నమస్కారం, వీరులకు వందనం పేరుతో జాతీయ భావాన్ని పెంపొందించనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెడల్స్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత బిసాటి జీవన్‌కుమార్, నెహ్రూ యువకేంద్రం ప్రోగ్రాం ఇన్‌ఛార్జి జి.శ్రీనివాసులు, వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.మద్దిలేటి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విష్ణుప్రియ, అనంతపురం అర్బన్ బ్యాంకు డైరెక్టర్ సుంకర రమేష్, నాగరాజు గుప్త, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ అధ్యక్షులు కె.జయమారుతి, కార్యదర్శి వై.పవన్, సభ్యులు తుకారాంనాయక్, శ్రీకాంత్, సంతోష్‌నాయక్, భరత్‌సాయి, గణేష్, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్నిదానాల కన్నా అన్నదానం మిన్న

**ఉరవకొండ :** సృష్టిలో అన్ని దానాల కన్నా మిన్న అన్నదానమే అని ఎంపిడిఒ అమృతరాజ్ అన్నారు. జై కిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రైతు దేవుళ్లకు అన్న ప్రసాదం కార్యక్రమం శనివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలాల వద్దకే వెళ్లి రైతులకు ఆహార ప్యాకెట్లు అందజేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు, ప్రతినిధులు రజినీకుమారి, గోపాల్, వంశీకృష్ణ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

## శాస్త్రీయ దృక్పథం పెంపునకు కృషి

### జెవివి రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎం.రంగన్న

**గుత్తి :** విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంచేందుకు కృషి చేస్తున్నామని జెవివి రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎం.రంగన్న తెలిపారు. శనివారం పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో జెవివి ఆధ్వర్యంలో నిర్వహించనున్న చెకుముకి సైన్సుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్షులు పి.వెంకటరామిరెడ్డి, మండల అధ్యక్షులు ఎ.రామాంజనేయులు, నాయకులు డాక్టర్ సి.వెంకటేశ్వర్లురెడ్డి, దేశాయి నాగరాజు, గురుశంకర్, రంగనాథ్, ఎవి.సుధాకర్‌బాబు, రమేష్, గైడ్ రమేష్, యుటిఎఫ్ మండల అధ్యక్షులు అహోబిలేసు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### ప్రభుత్వ సలహాదారు సాంబశివారెడ్డి

**ప్రజాశక్తి-నార్పల**

వైసిపి అధికారంలోకి వచ్చాక సిఎం జగన్ అమలు చేస్తున్న పథకాలు, మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నర్సింహయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరుతోందన్నారు. వీటన్నింటినీ ప్రజలకు సవివరంగా వివరించి 2024లో తిరిగి జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి వైసీపీ కార్యకర్తపై ఉందన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరించేందుకే ఈనెల 26న బుక్కరాయసముద్రంలో సాధికారిక బస్సుయాత్రను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ యాత్రలో నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వైసిపి సీనియర్ నాయకులు నార్పల సత్యనారాయణరెడ్డి, ఎంఇఎంఎస్ రాష్ట్ర డైరెక్టర్ నిట్టూరు రఘునాథరెడ్డి, జెడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపిపి నాగేశ్వరరావు, సింగిల్‌విండో ఛైర్మన్ లోకనాథ్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మిద్దె కుళ్లాయప్ప, మాజీ మార్కెట్ డైరెక్టర్ కేశవరెడ్డి, నాయకులు నాగలింగారెడ్డి, అమీర్ బాషా, షబ్బీర్, శ్రీరాములు, భాస్కర్‌నాయుడు, భాస్కర్‌రెడ్డి, దాడితోట బాషా, మనీలా శివయ్య, రమేష్, గోపాల్, శేఖర్‌రెడ్డి, గొల్లపల్లి శంకర్, కాటమయ్య, రాజారెడ్డి, పద్మాకర్‌రెడ్డి, రంగారెడ్డి, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

## బస్సుయాత్రను జయప్రదం చేయండి

**ప్రజాశక్తి-గుత్తి**

మంత్రులతో డోన్ వైసిపి ఎన్నికల పరిశీలకులు కోనా మురళీధర్‌రెడ్డి

ప్రభుత్వం చేపట్టిన బస్సు యాత్రను జయప్రదం చేయాలని డోన్ నియోజకవర్గ వైసీపీ ఎన్నికల పరిశీలకుడు, గుత్తి మాజీ ఎంపిపి కోనా మురళీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం బస్సుయాత్రకు సంబంధించి నంద్యాలలో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గాల పరిశీలకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు బస్సుయాత్రకు సంబంధించి పలు సూచనలు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కోనా మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 26 నుంచి 31 వరకు కొనసాగే బస్సు యాత్ర నంద్యాల జిల్లా అళ్లగడ్డ నుంచి ప్రారంభమవుతుందన్నారు. కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో మొదటి విడతగా బస్సుయాత్ర సాగుతుందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి మళ్లీ జగనే ఎందుకు కావాలి అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లనున్నట్లు తెలిపారు. బస్సుయాత్రకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

## రాజారెడ్డిపై దాడి అమానుషం

### జనసేన జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్

**అనంతపురం :** జనసేన నాయకుడు రాజారెడ్డి ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అనుచరులు దాడి చేయడం అమానుషమని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టి.సి.వరుణ్ అన్నారు. శనివారం నగరంలోని సప్తగిరి సర్కిల్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధర్మవరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి ఆగడాలు రోజురోజుకూ శృతి మించిపోయాయన్నారు. జిల్లాలో తిరిగి ఫ్యాక్షన్ రాజకీయాలను చేయాలన్న విధంగా ఆయన వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. సిసి ఫుటేజ్‌లో స్పష్టంగా దాడి చేసిన వారు కనబడుతున్నా ఇంతవరకు పోలీస్ యంత్రాంగం అరెస్టు చేయకపోవడం ఏంటని ప్రశ్నించారు. వెంటనే నిందితులను శిక్షించకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ఉపాధ్యక్షులు అంకే ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శులు రాపా ధనంజయ్, సంజీవరాయుడు, కిరణ్‌కుమార్, సిద్ధు, జయమ్మ, అవుకు విజయ్‌కుమార్, ముప్పూరి కృష్ణ, నగర ఉపాధ్యక్షులు జక్కిరెడ్డి ఆదినారాయణ, నగర ప్రధాన కార్యదర్శులు హుస్సేన్, దరాజ్‌బాషా, నగర కార్యదర్శులు ఆకుల అశోక్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 14వ బెటాలియన్‌లో అమరవీరుల సంస్మరణ దినోత్సవం

**ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం**

అమరవీరులకు నివాళులర్పిస్తున్న జైలర్ కె.చిన్నారావు

మండలంలోని జంతలూరు వద్ద ఉన్న 14వ బెటాలియన్‌లో పోలీసు అమర వీరుల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా నక్సలిజం, టెర్రరిజం, ఫ్యాక్షనిజం, మాఫియా తోపాటు పలు ఆర్థిక నేరగాళ్లను ఎదుర్కోవడంలో అసువులు బాసిన పోలీస్ సిబ్బందికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 14వ బెటాలియన్ ఏపీఎస్పీలో పని చేస్తూ అసువులు బాసిన పోలీసు సిబ్బంది ఉదయ్ భాస్కర్, బి.నారాయణస్వామి కుటుంబాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఆఫ్ జైలర్ కె.చిన్నారావు, అడిషనల్ కమాండెంట్ డి.నాగేశ్వరప్ప, అసిస్టెంట్ కమాండెంట్ డి.వి రమణమూర్తి, అసిస్టెంట్ కమాండెంట్ విల్సన్ కేర్, ఆర్.ఐలు నాగేంద్ర, లోకేశ్వరనాయుడు, సీతారామారావు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ ఎస్ఐలు, మినిస్ట్రీయల్ స్టాఫ్, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

## 'ఆరోగ్య సురక్ష'లో సకల వైద్యసేవలు

**ప్రజాశక్తి-అనంతపురం**


అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి సచివాలయ పరిధిలో పాల్గొన్న నాయకులు, అధికారులు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రజలకు సకల వైద్యసేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పలువురు నాయకులు తెలిపారు. శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నగరాలకు వెళ్లి మెరుగైన వైద్యం చేయించుకోలేని పేదల కోసమే సిఎం జగన్ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. ఇందులో భాగంగా ప్రత్యేక వైద్య నిపుణులు గ్రామాలకే వచ్చి పేదలకు వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి జూటూరు చంద్రకుమార్, అనంతపురం రూరల్ మండల అధ్యక్షులు వరలక్ష్మి, మండల స్పెషలాఫీసర్ మల్లికార్జున, ఎంపిడిఒ పుల్లయ్య, ఎంపిటిసి జూటూరు పెన్నోబులేసు, ఉపసర్పంచి బండి రమేష్, వైసిపి సీనియర్ నాయకులు గుజ్జల ఈశ్వరయ్య, కల్లుమడి శ్రీనివాసులు, గాండ్ల సి.మనోజ్, నందకిరణ్, అనన్య, సాయిగణేష్, పంచాయతీ కార్యదర్శి నరసింహారెడ్డి, విఆర్ఓ ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

**అనంతపురం :** రాప్తాడు మండలం బండమీదపల్లి గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి చిట్రెడ్డి జయలక్ష్మి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గతనెల రోజుల నుంచి మండలంలోని ప్రతి గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సూచన మేరకు వైద్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సొలమాన్‌రాజ్, ఎంపిటిసి రుక్మిణమ్మ, సూర్యనారాయణ, సర్పంచి ఉమా పక్కీరప్ప, వైసిపి నాయకులు, సచివాలయ సిబ్బంది, ఆశావర్కర్లు, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

**రాయదుర్గం రూరల్ :** మండల పరిధిలోని డి.కొండాపురంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ కాపు రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పరిశీలించారు. ఇందులో భాగంగా 362 మందికి వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి మల్లికార్జున, ఎంపిడిఒ కొండయ్య, తహశీల్దార్ మారుతి, పంచాయతీ విస్తరణ అధికారి రంగనాయకులు, వైద్యాధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

**శింగనమల :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి భారీ స్పందన వస్తోందని ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సుధారాణి, ఎంపిడిఒ నిర్మలాకుమారి తెలిపారు. శనివారం మండల పరిధిలోని పెరవలి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి మురళీకృష్ణ, ఎంఇఒ-2 శివప్రసాద్, మండల పరిషత్ పరిపాలన అధికారి శ్రీనివాసులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.ఉమాదేవి, డాక్టర్ ఫిర్దోష్, టిప్పు హుస్సేన్, తజ్మహాల్ హుస్సేన్, కృష్ణమూర్తి, విఆర్ఓ రాముడు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ గౌడ్, రామాంజనేయులు, సచివాలయ ఏఎన్ఎం ఆశాబీ, హెల్త్ ప్రొవైడర్ అనూషా, సచివాలయ సిబ్బంది, వాలంటరీలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

**ఉరవకొండ :** విడపనకల్లు మండల పరిధిలోని హవలిగి సచివాలయం-2లో సర్పంచి కె.గీతమ్మ అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసులు, వైద్యాధికారులు హరినాథ్‌రెడ్డి, రాజేష్, జెసిఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి, ఎంపిటిసిలు కళావతి రాజశేఖర్, రాజమ్మ, పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబు, వైద్య బృందం, స్కూల్ కమిటీ ఛైర్మన్ భూమా, నాయకులు కరణం భీమిరెడ్డి, రాజశేఖర్, రఘురాం, వడ్డే మడకశిర, స్వామి, సచివాలయ, అంగన్వాడీ సిబ్బంది, వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరికీ మంచి జరగాలి

### జెఎన్‌టియు విసి రంగజనార్ధన - ఘనంగా ఆయుధపూజ

**ప్రజాశక్తి-అనంతపురం**

దుర్గామాత పూజ చేస్తున్న విసి రంగజనార్ధన, సిబ్బంది

దుర్గామాత ఆశీస్సులతో ప్రతి ఒక్కరికీ మంచి కలగాలని జెఎన్‌టియు విసి జి.రంగజనార్ధన ఆకాంక్షించారు. శనివారం స్థానిక జెఎన్‌టియు విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో ఘనంగా ఆయుధ పూజ నిర్వహించారు. ముందుగా దుర్గామాతకు పూజ చేశారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ మంచి ఆరోగ్య, అష్ట ఐశ్వర్యాలు కలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య సి. శశిధర్, యూనివర్సిటీ డైరెక్టర్లు ఇ.కేశవరెడ్డి, సుమలత, ఆర్.కిరణ్మయి, ఈశ్వర్‌రెడ్డి, వి.బి.చిత్ర, పి.సుజాత, సురేష్‌బాబు, శోభాబిందు, పద్మసువర్ణ, సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్.వి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణకాంతి, బి.చంద్రమోహన్‌రెడ్డి, ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, కో ఆర్డినేటర్లు జి.మమత, ఎం.రామశేఖరరెడ్డి, టి.నారాయణరెడ్డి, కెఎఫ్.భారతి, కళ్యాణ్‌కుమార్, అజిత, స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి జోజిరెడ్డి, డిప్యూటీ రిజిస్టర్లు ఎన్.మధుసూదనరెడ్డి, దుర్గాప్రసాద్, రంగానాయక్, తదితరులు పాల్గొన్నారు.

## గుమ్మేపల్లి పంచాయతీ అభివృద్ధే ధ్యేయం

**శింగనమల :** గుమ్మేపల్లి పంచాయతీ అభివృద్ధే తమ ధ్యేయమని సర్పంచి డేగల లలితమ్మ, టిడిపి అనంతపురం అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దసరా పండుగ సందర్భంగా గుమ్మేపల్లి గ్రామ పంచాయతీలోని గుమ్మేపల్లి, ఏకులనాగేపల్లి గ్రామాల్లో వీధిలైట్లు మరమ్మతులతోపాటు నూతన లైట్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## నేరాలు ఘోరాలు

### మద్యం మత్తులోనే వ్యక్తి హత్య

నిందితుల వివరాలను వెల్లడిస్తున్న వన్‌టౌన్ పోలీసులు

**అనంతపురం క్రైం :** తాగిన మైకంలో తిట్టినందుకు వ్యక్తిని హత్య చేసిన సంఘటన స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల మేరకు పామిడికి చెందిన షేక్ రఫీ స్థానిక రాణీ నగర్ కు చెందిన షేక్ రెహానాను వివాహం చేసుకుని ఇక్కడే బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రఫీ తరచూ తాను పని చేసే చోట రాణీనగర్ కు చెందిన పఠాన్ ఆలీఖాన్, సిమెంట్ లోడు చేసే వీరపెద్దన్న అలియాస్ వీరి, బోయ రవికుమార్ లతో కలిసి మద్యం సేవించేవాడు. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో పఠాన్ ఆలీఖాన్, వీరపెద్దన్న, బోయ రవికుమార్ లు స్థానిక గుత్తి రోడ్డు లోని ఫైవ్ ల్యాంప్స్ కూడలిలో మద్యం సేవించారు. అప్పుడే ఇంటికి వెళ్తున్న రఫీ తో ముగ్గురూ వాదనకు దిగారు. రఫీ ముగ్గురినీ అసభ్యంగా తిట్టడంతో దాడి చేసి సమీపంలో ఉన్న బండరాయితో రఫీ తలపై కొట్టి హత్య చేశారు. జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు డీఎస్పీ ప్రసాదరెడ్డి పర్యవేక్షణలో వన్ టౌన్ సీఐ రెడ్డప్ప, ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఎన్టీఆర్ మార్గ్ లోని భవానీనగర్ వద్ద ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. హత్య జరిగిన 24 గంటలలోపే నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులను ఎస్పీ అభినందించారు.

### ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో చోరీ

**రాయదుర్గం :** రాయదుర్గం పట్టణ పొలిమేరలో జాతీయ రహదారి చెక్‌పోస్టు వద్ద ఉన్న పవిత్ర ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో శుక్రవారం రాత్రి చోరీ జరిగినట్లు దుకాణం యజమాని వెంకీ వాపోయాడు. దుకాణం షెడ్డుకు పక్కన ఉన్న ఇనుప రేకులు కత్తిరించి దొంగలు లోనికి ప్రవేశించి సుమారు రూ.4వేల నగదు, 20 లీటర్ల పెట్రోలు, రూ.6వేలు విలువజేసే సిగరెట్లు, నూనె, బియ్యం ప్యాకెట్‌ను చోరీ చేసినట్లు తెలిపారు. శనివారం ఉదయం దుకాణం తెరవడానికి వెళ్లగా దుకాణంలో చోరీ జరిగినట్లు వెల్లడించదన్నారు.